## క్లుప్తంగా

### ఎంపీ కావ్యను కలిసిన కాంగ్రెస్ నాయకుడు



**స్టేషన్‌ఘన్‌పూర్:** వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొదల రాజు శనివారం హనుకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కావ్యకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఘన్‌పూర్ మండలంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

### సీఎం సోదరుడిని కలిసిన 'ప్రశాంత్‌రెడ్డి'



**జనగామ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర యువనాయకుడు, డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఆయన వెంట జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి ఉన్నారు.

### నాణ్యతతో కూడిన ప్రగతి శ్రేయస్కరం



**జనగామ రూరల్:** నాణ్యతతో కూడిన ప్రగతి శ్రేయస్కరమని లయన్స్ క్లబ్ ఉమ్మడి వరంగల్ జిల్లా గవర్నర్ కందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో జనగామ జిల్లా లయన్స్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల ఆస్ట్రేలియా దేశం మెల్బోర్న్‌లో జరిగిన అంతర్జాతీయ మహాసభకు హాజరైన ఆయన అవిభక్త వరంగల్ జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జనగామ 8 రీజియన్ క్లబ్ ప్రతినిధితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, గోవింద్‌రాజ్, లవకుమార్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, పరశురాములు ఉన్నారు.

### నియామకం


గట్టయ్య

**చిల్పూరు:** సామాజిక న్యాయవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన సాదం గట్టయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు యెషబోయిన సాంబయ్య యాదవ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ సామాజిక న్యాయ వేదికను బలోపేతం చేస్తూ పేదల పక్షాన నిలబడుతానని అన్నారు.

### నేడు మండల సభ

**రఘునాథపల్లి:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ మేకల వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే మండల సభకు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరు కాలరని కోరారు. మండల సభకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ పాలకవర్గానికి ఇదే చివరి సర్వసభ్య సమావేశం అని ఎంపీడీఓ తెలిపారు.

**నేడు ప్రజాసదస్సులు**

**దేవరుప్పుల:** మండలంలోని సీర్మాల, రామరాజుపల్లిలో నేడు(ఆదివారం) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాసదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మడంల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు తెలిపారు. విధిగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందిస్తే పరిష్కరించేందుకు పాటుపడుతామన్నారు.

**నేడు పీఏసీఎస్‌లో రైతు బంధుపై సలహాల స్వీకరణ**

**దేవరుప్పుల:** మండల కేంద్రంలోని సహకార సంఘంలో నేడు(ఆదివారం) ప్రత్యేక మహాజన సభ ద్వారా రైతు బంధుపై సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. సహకార సంఘం పాలకమండలి ప్రతినిధులతోపాటు సభ్యత్వం కలిగిన ప్రతి సభ్యులు ఉదయం 10:30 గంటలకు జరిగే సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### హైనా దాడిలో దూడ మృతి

**బచ్చన్నపేట:** హైనా దాడిలో దూడ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గుడిచెరువు సమీపంలోని తనవ్యవసాయ బావి వద్ద రోజు మాదిరిగానే పశువులను శుక్రవారం రాత్రి కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూడగా హైనా దాడి చేయడంతో దూడ మృతి చెందినట్లు గుర్తించాడు. దూడ మృతితో గేదె పాలు ఇవ్వడం లేదని వాపోయాడు. అధికారులు హైనాలను పట్టుకోవాలని కోరాడు.

# రైల్వేస్టేషన్ దశ మారేనా ?

- ఘన్‌పూర్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు ప్రయాణికుల డిమాండ్
- నూతన ఎంపీ స్పందించేనా..


స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్

**స్టేషన్‌ఘన్‌పూర్:** డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలను కలిపేలా ఉన్న స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏళ్ల తరబడి పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. 125 ఏళ్ల క్రితం అప్పటి నిజాం ప్రభుత్వంలో ఎన్ఎస్ఆర్(నిజాం స్టేట్ రైల్వే) పేరిట ఇక్కడ రైల్వేస్టేషన్ ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఘనమైన చరిత్ర ఉన్న రైల్వే స్టేషన్‌లో సమస్యలు కూడా మేజర్‌గానే ఉన్నాయి. గతంలోనే స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా గుర్తించినా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉన్నాయి. స్థానిక వ్యాపారులు, ప్రజలు పలు మార్లు సమస్యలను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి, గత ఎంపీ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు రైల్వేస్టేషన్ సమస్యను పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ దక్కేనా..?**

స్థానిక రైల్వేస్టేషన్‌లో పుష్‌పుల్, కాకతీయ ప్యాసింజర్ రైళ్లు, భాగ్యనగర్, గోల్కొండ, తెలంగాణ, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉంది. అయితే ఇక్కడ ఆలేరు, జనగామతో పోలిస్తే ఆదాయం మెరుగ్గా ఉంటుంది. అయినప్పటికీ ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణికులకు సికింద్రాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా రైళ్ల సౌకర్యం లేక సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. ఇక్కడ పద్మావతి, గౌతమి, మచిలీపట్నం, హౌరా, శాతవాహన, దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ప్రజల నుంచి తీవ్రంగా డిమాండ్ ఉంది. క్యాంటిన్, టాయిలెట్ల సౌకర్యం లేదు. రెండు ప్లాట్‌ఫారాల్లో షెడ్‌లు పూర్తిస్థాయిలో లేక వర్షాకాలం, వేసవికాలంలో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల్ని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వరంగల్ నూతన ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఈ విషయమై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**మచిలీపట్నం, దక్షిణ్‌లకు హాల్టింగ్ కల్పించాలి**



స్థానిక రైల్వేస్టేషన్‌లో ఉదయం, రాత్రి పుష్‌పుల్, కాకతీయ తర్వాత ప్రయాణికులకు సౌకర్యంగా రైళ్ల సౌకర్యం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు పలు పనులపై సికింద్రాబాద్‌కు అప్ అండ్ డౌన్ చేస్తుంటారు. దక్షిణ్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తే అందరికీ అనువుగా ఉంటుంది.

– తెల్లాకుల రామకృష్ణ

**సమస్యల్ని పరిష్కరించాలి**



ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవతో పనిచేయాలి. ప్రధానంగా ప్లాట్‌ఫాంపై షెడ్‌లు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల సమస్యలు ఉన్నాయి. అదేవిధంగా పద్మావతి, గౌతమి, శాతవాహన తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి.

– కొలిపాక సతీష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు

# పౌష్టికాహారంతోనే ఎదుగుదల


పిల్లల ఎత్తు, బరువును పరిశీలిస్తున్న సిబ్బంది

**నర్మెట:** పౌష్టికాహారంతోనే పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ గూడెల్లి సునీతాదేవి అన్నారు. గ్రోత్ మేళాలో భాగంగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సమావేశమందిరంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 5 ఏళ్లలోపు పిల్లల ఎత్తు బరువులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం బలహీనంగా ఉన్న పిల్లల తల్లులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దన్నారపు శోభారాణి, సిరిమల్లె విజయ లక్ష్మి, దాసరి స్వరూపారాణి, ఆకునూరి సృజన, ప్రెజ్ఞాపురం రజిత, ఏఎన్ఎంలు సుల్తానా, గాదెర కరుణ, ఆశలు చంద్రకళ, స్వేత, శ్యామల, మంగ, ఆయాలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ కరువు


రాజేందర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**జఫర్‌గఢ్:** కామన్ స్కూల్ విధానంపై ప్రభుత్వాలకు అవగాహన లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు ప్రజాదరణకు నోచుకోవడం లేదని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి తెలిపారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రాజేందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి లింగారెడ్డి హాజరై మాట్లాడారు. కామన్ స్కూల్ విధానంతో ప్రభుత్వ పాఠశాలలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. అనంతరం రాజేందర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ వెంగల్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం ఎండీ పర్వేజ్, డీటీఎఫ్ జిల్లా నాయకులు అబ్దుల్‌అలీం, చొక్కయ్య, సురేష్, వేణుమాధవ్, వెంకటపతి, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కోరుకొప్పుల రాజుతో పాటు వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'నీట్'ను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

**జనగామ రూరల్:** నీట్ పరీక్షను, ఎన్‌టీఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర బాధ్యుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ఏటకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పరీక్ష మూల స్తంభమని, విశ్వసనీయత కోల్పోతే విద్యా వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుందన్నారు. నీట్ పరీక్ష విశ్వసనీయత కోల్పోయిందని, 23లక్షల మంది విద్యార్థుల కష్టం బూడిదలో పోసిన పన్నీరయిందని అన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు లక్ష్మయ్య, చొక్కయ్య, రాజు,దివాకర్‌రెడ్డి, రాజారెడ్డి, లక్ష్మణ్, వసంత, ఉమాదేవి, శ్రీనివాసచారి, ఆంజనేయచారి పాల్గొన్నారు.

# రెవెన్యూ ఉద్యోగుల నిరసన


స్టేషన్‌ఘన్‌పూర్: డీటీకి మెమోరాండం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది


కొడకండ్ల: నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

**స్టేషన్‌ఘన్‌పూర్:** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల గిర్దావర్ వెంకటరెడ్డిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అకారణంగా తహసీల్దార్ కార్యాలయంలోకి వచ్చి దుర్భాషలాడి సస్పెండ్ చేయించడాన్ని నిరసిస్తూ ఘన్‌పూర్ రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది తహసీల్ ఎదుట శనివారం నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గిర్ధావర్ వెంకట్‌రెడ్డికి తగిన న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు మెమోరండం అందించారు. కార్యక్రమంలో ఆర్ఐలు అర్జున్, రవీందర్, ఎన్నికల డీటీ రాజేష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్‌లు దేవేందర్, ప్రవీణ్, సుమలత, టెక్నికల్ అసిస్టెంట్ రేణుక, సిబ్బంది బాలరాజు, కుమార్ పాల్గొన్నారు.

**దాడి సరికాదు**

**కొడకండ్ల:** రెవెన్యూ ఉద్యోగులపై దాడులు సరికాదని మండల రెవెన్యూ ఉద్యోగులు అన్నారు. శనివారం రెవెన్యూ ఉద్యోగులపై దాడులను ఖండిస్తూ ఆర్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్ కోల చంద్రమోహన్‌కు మెమోరాండం సమర్పించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ తహసీల్దార్ కార్యాయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐపై దాడిని వారు ఖండిస్తూ, అతనిపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని, సెలవు రోజుల్లో సిబ్బందితో పనులు చేయించకూడదని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టైపిస్ట్ రవి, జూనియర్ అసిస్టెంట్లు దామోదర్, అనీల్, నాగమణి, రికార్డు అసిస్టెంట్లు సోని, సత్యప్రకాష్, అరుణలు పాల్గొన్నారు.

### నివాళి



**కొడకండ్ల:** మండలంలోని పాకాలలో వల్లపురెడ్డి రత్నమ్మ, నీలిబండతండాలో భూక్యా సేత్రాంలు మృతి చెందారు. కాగా శనివారం మృతదేహాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. నాయకులు రవీందర్, హేమాని, మణిరాం, రాజారాం, భాస్కర్, సుమన్, యుగంధర్‌రెడ్డి, నరేష్, అమర్, శ్రీనివాస్, ఎల్లయ్య ఉన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ఎల్‌ఓసీ అందజేస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

**బచ్చన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన దూసరి కనుకయ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 2.5 లక్షల ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడు కనుకయ్య చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమవడంతో విషయం తెలుసుకుని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండ సురేఖ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఎల్ఓసీని మంజూరు చేయించారని తెలిపారు. నాయకులు కోడూరి మహాత్మాచారి, ప్రభాకర్, సతీష్, అభిగౌడ్, బుల్లి అజయ్, ఎనుగుల ఓజలు, చిలువేరు బిక్షపతి, శ్రీనివాస్, వెంకటాచారి, శ్రీమణిచంద్ర, సంజయ్, నంద, అఖిల్, గణేష్, శ్రీకాంత్, భాను, ఆంజనేయులు పాల్గొన్నారు.

### గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న విజేందర్

**బచ్చన్నపేట:** గోపాల్‌నగర్ గ్రామంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులను గుర్తించి పట్టాలు అందజేయాలని సీపీఎం మండల ఇన్‌చార్జ్ సుంచు విజేందర్ కోరారు. మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో వేసిన గుడిసెలను ఆయన శనివారం సందర్శించి మాట్లాడారు. గతంలో మూడు సార్లు నిరుపేదలు గుడిసెలను వేసుకుంటే పోలీసులు తొలగించారని ఈ సారి మాత్రం తొలగించొద్దన్నారు. ఈ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని భయభ్రాంతులకు గురి చేయకుండా ప్రభుత్వం పేదల పక్షాన నిలబడాలని, ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. నాయకులు వెంకటవ్వ, కడకంచి బాలరాజు, పొన్నాల రాజవ్వ, మమత, రాజవ్వ, నవనీత, బుచ్చమ్మ, శోభ, హంసవ్వ, సౌందర్య, శైలజ, కనుకయ్య, బాలరాజు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

**పాలకుర్తి:** మండలంలోని ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని దర్దేపల్లి గ్రామంలో సమస్యల గుర్తింపునకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీటి, విద్యుత్, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు దారుల సమస్యలను తెలుసుకున్నామని తెలిపారు. గ్రామస్తులు ఏకగ్రీవ నిర్ణయాలతో చేసిన తీర్మానాన్ని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి తెలియ జేసి పరిష్కరించనన్నట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు భూముల దండయ్య, జలగం కుమార్, మంద సోమయ్య, రాంచంద్ర సోమయ్య, నరేష్, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల అందజేత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

**తరిగొప్పుల:** మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన బావండ్లపల్లి ఉప్పలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కాగా బాధిత కుటుంబసభ్యులను రేయిన్‌బో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు శనివారం పరామర్శించారు. మృతిరాలి కుటుంబసభ్యులకు 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జొన్నగోని రవీందర్, బోగం అనూప్, అక్తర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' కూలి పెంచాలి


మాట్లాడుతున్న రమేశ్

**బచ్చన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు కూలిని పెంచి, ప్రభుత్వ భూములను వారికి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగార రమేశ్ కోరారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మండల అధ్యక్షుడు ఇంజ ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రెండో మహా సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని 200 రోజులకు పెంచి రోజు కూలి రూ. 600లకు పెంచాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలిచి పోరాటం చేస్తుందని అన్నారు. అనంతరం సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇంజ ఎల్లయ్య, కార్యదర్శిగా తాళం రాములు, ఉపాధ్యక్షులుగా కొడుకుల సిద్దయ్య, కూరపాటి లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా బొట్టు కమలమ్మ, భూమయ్య, సభ్యులుగా పయ్యావుల శ్రీలత, పాకాల కవిత, బింగి అరుణ, తుర్కపల్లి సుజాత, భావండ్లపల్లి సంపూర్ణ, దానబోయిన బాలరాజు, శాకంపల్లి కనుకయ్య, విజయ్, విద్యాల శ్రీలత, కొలుగూరి అరుణ, చెన్నూరి మాధవిలను ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మహిళలు, నాయకులు, కార్మికులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి చక్రపాణి

**స్టేషన్‌ఘన్‌పూర్:** ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా పాలకులు దివ్యాంగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి ఈగ చక్రపాణి అన్నారు. మండలంలోని సముద్రాల గ్రామంలో శనివారం దివ్యాంగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలపై ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు పలు హామీలు చేశారన్నారు. దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ అందించాలన్నారు. దివ్యాంగులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. దివ్యాంగుల న్యాయమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో దివ్యాగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

**బచ్చన్నపేట:** గంగాపూర్ గ్రామంలో బందారం అంజమ్మ మృతి చెందింది. కాగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల సాయం శనివారం అందజేశారు. బందారం క్రాంతి కుమార్, జ్యోతి ఉమాపతి, శివయ్య, ధనుంజయ, భద్రయ్య, నర్సయ్య, మల్లయ్య, సుదర్శన్ ఉన్నారు.

# వైభవంగా వారకల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**చిల్పూరు:** చిల్పూరు బుగులు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ వైభవంగా వార కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఇసుకపల్లి వెంకటేశ్వర్లు–లలితకుమారి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. సిబ్బంది రమేశ్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, వసంత, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు, వసంత పాల్గొన్నారు.